# లాయర్లు ఉద్యమించాల్సింది దేనిమీద?


కె. బాలగోపాల్

అప్పుడే మొదలయింది. ముంబైలో జరిగిన దాడి నేపథ్యంలో పార్లమెంటు చట్ట వ్యతిరేక కార్యకలాపాల (నిరోధక) చట్టానికి (యుఎపిఎ) చేపట్టిన సవరణ, ముంబై తరహా హింసాత్మక ఘటనలను నిలువరించడానికి పనికిరాకపోగా సాధారణ ప్రజలపైన అన్యాయమైన నిర్బంధానికీ అణచివేతకూ దారి తీస్తుందని చేసిన హెచ్చరికల ప్రతిధ్వని ఇంకా చెవులకు వినపడుతుండగానే సవరించిన చట్టం కింద మొదటి అరెస్టు విశాఖపట్నంలో జరిగింది. అరెస్టయిన వ్యక్తి విశాఖపట్నం హార్బర్‌నో లైట్ హౌజ్‌నో కొత్తగా కట్టిన గంగవరం పోర్టునో పేల్చేయడానికి ఎక్కడినుండో వచ్చిన వ్యక్తికాదు. అతను జగదాంబ సెంటర్‌లో ఎకె–47తో కాల్పులు జరపలేదు, గీతం కాలేజి దగ్గర గ్రేనేడ్లు పేల్చలేదు.

అతను గిరిజన సహకార సంఘంలో జూనియర్ అసిస్టెంట్‌గా ఉద్యోగం చేస్తున్న సల్లంగి సుగునాధం అనే ఆదివాసి. చాలా ఏళ్లుగా పాడేరు ఏజెన్సీలో ఆదివాసీ ఉద్యమాలకు అండగా ఉంటున్నాడు. పౌరహక్కుల సంఘంలో చురుకుగా పనిచేస్తున్నాడు. ఈ పాత్రలలో ప్రభుత్వాన్నీ ప్రభుత్వ విధానాలనూ విమర్శిస్తున్నాడు, ఆ విధానాలను ఎదుర్కొనడంలో అక్కడి ప్రజలకు అండగా ఉంటున్నాడు.

అతనిని పోలీసులు ఫిబ్రవరి 5వ తేదీన ఆంధ్ర విశ్వవిద్యాలయం పరిసరాలలో అరెస్టు చేశారు. రాత్రి 9.30 ప్రాంతంలో జరిగిన ఈ అరెస్టు గురించి సుగునాధం బంధువయిన తెలుగు విభాగం అధ్యాపకుడు మరుసటి రోజే నగర పోలీస్ కమిషనర్‌కు ఫిర్యాదు చేయడం వల్ల కాబోలు, 6వ తేదీనే అతనిని కోర్టులో హాజరు పెట్టారు. అయితే కేసు మాత్రం పెద్దది పెట్టారు. మొన్ననే పార్లమెంటు తాజాగా వండిన యుఎపిఎ సవరణ కింద పెట్టారు. అతని దగ్గర పాడేరు పోలీస్ స్టేషన్ మ్యాపు గల కాగితం, మావోయిస్టు నాయకుడు కార్యకర్తలకు రాసిన ఉత్తరం దొరికాయన్నారు. పట్టుకొని ప్రశ్నించగా, మావోయిస్టులు భద్రం చేయమని తనకిచ్చిన పేలుడు పదార్థాలను పాడేరు దగ్గర ఒకచోట పాతిపెట్టానని చెప్పాడని కూడ అన్నారు. ఈ కాగితాలు, ఒప్పుకోలుల ఆధారంగా అతనిపైన సవరించిన యుఎపిఎలోని సెక్షన్లు 15,16, 18, 23, 35, 38, 39 ల కింద (పాత చట్టాలలోని కొన్ని పాత సెక్షన్లు కలుపుకొని) కేసు పెట్టారు. సుగుణాధానికి మావోయిస్టుల పట్ల రాజకీయంగా సానుభూతి ఉండి ఉండవచ్చును గానీ వారి పేలుడు పదార్థాలను భద్రపరిచే తెలివితక్కువతనానికి ఒడిగడతాడని నమ్మేవారెవరూ లేరు. ఏమయితేనేం, కోర్టు అతనికి కొత్త చట్టం కింద 30 రోజుల రిమాండు ఇచ్చింది. అతను నేరం చేయలేదని జడ్జిగారు నమ్మితే తప్ప బెయిలు రాదు. ఆరు నెలల దాకా పోలీసులు ఛార్జిషీటు దాఖలు చేయనక్కరలేదు. అతని పరోక్షంలో, అతని వకీలు పరోక్షంలో, సాక్షులను కోర్టు విచారించి శిక్ష వేసేయొచ్చు. పాడేరు దగ్గర ఫలానా చోట మావోయిస్టులు దాచి ఉంచిన పేలుడు పదార్థాల గొయ్యి దగ్గర సుగుణాధానికి చెందిన జేబురుమాలు దొరికిందని చూపిస్తే చాలు, నేరం తాను చేయలేదని సుగునాధం (జైలు లోపలే ఉంటూ) రుజువు చేసుకోవాలి.

ఇది దుర్మార్గం అంటే అనండిగానీ దుర్వినియోగం అనొద్దు దయచేసి. ఇదే సద్వినియోగం, ఇదే ఉద్దేశించిన వినియోగం. బజార్లో బాంబులు పెట్టే వాళ్లు, రైలు పట్టాల మీద గ్రేనేడ్లు పెట్టే వాళ్లు దొరికితే కదా వారిపైన 'కఠిన చట్టాలు' ప్రయోగించడానికి ? వాళ్లు దొరికిందెపుడు, దొరికి 'ఎన్‌కౌంటర్'కాకుండ బతికిందెప్పుడు? మరి వాళ్ల పేరు మీద 'కఠిన చట్టాలు' చేయడం ఎందుకు? ఎందుకంటే, వారికి సహాయం, సహకారం, మద్దతు వగైరాలు అందించేవారిని అదుపుచేయడానికి. ఆ సహాయం, సహకారం ఆయుధాలు సమకూర్చే రూపంలో ఉండనవసరం లేదు. హింసతోనూ హింసా సామాగ్రితోనూ నిమిత్తం లేనిదయి ఉండవచ్చు. సుగుణాధం పాడేరు దగ్గర పేలుడుపదార్థాలు భద్రం చేసి ఉంచానన్న ఒప్పుకోలు ఇచ్చాడని అభియోగం చేయకున్నా, కేవలం బలిమెల దాడి నుంచి వెనక్కి పోతున్న మావోయిస్టులకు బిందెడు మంచినీళ్ళిచ్చానని ఒప్పుకోలు ఇచ్చాడని అని ఉన్నా ఇదే కేసు అతని పైన పెట్టి ఉండవచ్చు.



అయినా యుఎపిఎలో సవరణలు చేసింది రైల్వే స్టేషన్‌లోనూ హోటళ్ల మీదా కాల్పులు జరిపి అమాయకులను చంపిన దుండగుల కోసం, అటువంటి విచ్చలవిడి హింసాకాండకు పాల్పడేవారి కోసం అన్నారు కదా! మావోయిస్టుల ప్రస్తావన దానిలో ఎట్లా వచ్చింది? మరి మావోయిస్టులు హింసాకాండకు పాల్పడతారు, అప్పుడప్పుడూ విచక్షణారహితమైన హింసకూ పాల్పడుతారు, కానీ పనిగట్టుకొని బజార్లోపోయే వాళ్లను చంపే బీభత్స కాండకు పాల్పడలేదు కదా అని మీకు అనుమానం రావచ్చు. కానీ పేరొకరిది చెప్పినా కొత్త చట్టాన్ని బీభత్సకాండకు పాల్పడే వారి కోసం, వారిని పోలినవారి కోసం చేయకుండ అటువంటి హింసాకాండ చూసి ఎరుగని 1967 కాలం నుంచి ఉనికిలో ఉన్న యుఎపిఏలో సవరణ రూపంలో చేశారు కాబట్టి అది ముంబై హింసాకాండను పోలినచర్యలకు పాల్పడే వారికి మాత్రమే కాదు, చాలా మందికి వర్తిస్తుంది. 1967 నాటి ఆ చట్టాన్ని 2004లో సవరించి టెర్రరిస్టు సంస్థలు అనే జాబితాను అందులో చేర్చారు. 2008లో దానినే సవరించి 'కఠినమైన' నేర విచారణ పద్ధతిని ప్రవేశపెట్టారు. అది మావోయిస్టులకూ వర్తిస్తుంది. అప్పుడెప్పుడో మూడు చర్చిలలో పేలని బాంబులు పెట్టారన్న అభియోగంతో దశాబ్దకాలంగా నిషేధం ఎదుర్కొంటున్న దీన్ దార్ అంజుమన్‌కూ వర్తిస్తుంది. ఈ దేశంలో ఎప్పుడూ ఎవరి మీదా ఒక బాంబు వేసి ఎరుగని అఖిల భారత నేపాలీ ఏక్తా సమాజ్‌కూ వర్తిస్తుంది. గుడ్డి మతవాదాన్ని ప్రదర్శించడం తప్ప భౌతికహింసకు ఎన్నడూ పాల్పడని కాశ్మీరీ మహిళా సంస్థ దుఖ్తరన్– ఇ– మిల్లత్‌కూ వర్తిస్తుంది.

ఇది కూడ దుర్మార్గం అంటే అనండి గానీ దుర్వినియోగం అనొద్దు దయచేసి. ఇదే సద్వినియోగం. ఇదే ఈ చట్ట సవరణలు ఉద్దేశించిన వినియోగం. 1980ల లో దేశ రాజధానిలో ఢిల్లీ ట్రాన్స్‌పోర్టు కార్పొరేషన్ బస్సులలో బాంబులు పెట్టి స్కూలు పిల్లలను చంపిన ఖలిస్తాన్ వాదుల పేరు చెప్పి టాడా చట్టం చేశారు. దానిని నక్సలైట్లపైన ప్రయోగించారు. కొంచెం ఎక్కువ మిలిటెన్సీ ప్రదర్శించిన కార్మిక సంఘాల నాయకుల పైన ప్రయోగించారు. ఖలిస్తాన్ నినాదం పుట్టక కొన్ని దశాబ్దాల ముందు నుంచి దేశంలో జరుగుతున్న మత ఘర్షణలకు దానిని వర్తింపజేసి మైనారిటీలపైన ఏకపక్షంగా ప్రయోగించారు. 'టాడా' సహజమరణం పాలయిన తరువాత కాశ్మీర్‌లో హింసాకాండను కారణంగా చూపించి రూపొందించిన 'పోటా'నూ ఇదే విధంగా ప్రయోగించారు. అది కూడ కాలధర్మం చేసింది. దాని స్థానంలో యుఎపిఎ సవరణలు 2004లో తెచ్చారు. ముంబై హింసాకాండ తరువాత 2008లో దానిని మరింత కఠినతరం చేశారు. ఇప్పుడు అదే విధంగా ప్రయోగిస్తున్నారు. ఉద్దేశ్యమే అది, ఆ చట్టాలలోని భాషే అది. ఒక సాకు కావాలి, అది భీకరంగా ఉండాలి, దానిని చూపించి కొత్త చట్టం చేయాలి, ఆ సాకుకు పరిమితం కాని విశాల పరిభాషలో చేయాలి. దొరికిన వారందరి పైనా దానిని ప్రయోగించాలి. 'కఠిన చట్టాల' నైజమే ఇది.

నేర విచారణా స్మృతి (సిఆర్‌పిసి)లో 'అన్యాయమైన' సవరణలను వ్యతిరేకించే పాత్ర మీద వేసుకొని ముందుకొస్తున్న న్యాయవాద సంఘాలకూ బార్ అసోసియేషన్లకూ ఇది ఎందుకు కనిపించడం లేదో! హక్కుల పైన తీవ్రంగా దాడిచేసే యుఎపిఎ సవరణలను వదిలిపెట్టి, ముద్దాయికి హక్కులు కల్పించే సిఆర్‌పిసి సెక్షన్ 41 సవరణపైన వారి ఆగ్రహం ఎక్కుపెట్టడం ఆశ్చర్యం కలిగించే విషయమే. ఒక వ్యక్తిపైన కాగ్నిజబుల్ నేరం నమోదు కాగానే అతనిని అరెస్టు చేసి తీరాలని ప్రస్తుత నేర విచారణా స్మృతి చెప్పదు. అరెస్టు చేయడానికే వీలులేని సెక్షన్ 41 సవరణా చెప్పదు. అప్పుడయినా ఇప్పుడయినా అరెస్టు చేయడం చేయకపోవడం పోలీసుల పరిధిలో ఉన్న విచక్షణే. ఈ విషయం సుప్రీం కోర్టు చాలా సార్లు స్పష్టం చేసింది. అయితే ఇప్పటిదాకా ఈ విచక్షణకు ఏ ప్రమాణం ఉండేది కాదు. అది పూర్తిగా పోలీసుల ఇష్టాయిష్టాలకే విడిచి పెట్టబడింది. ఈ సవరణ ఒక హేతుబద్ధమైన ప్రమాణాన్ని పెట్టింది. 7 సంవత్సరాల కంటే ఎక్కువ శిక్ష పడగల నేరాల విషయంలో పోలీసులకుండే అరెస్టు చేసే అధికారం ఎప్పటిలాగే ఉంటుంది. అంతకంటే తక్కువ శిక్ష పడగల నేరాల విషయంలోనూ అనుమానితుడు నేర పరిశోధనకు ఆటంకం కలిగిస్తాడని సహేతుకమయిన ఆధారాలున్నట్టయితే అరెస్టు చేయవచ్చు. సాక్షులను బెదిరిస్తాడని సాక్ష్యాలను మాయం చేస్తాడని నమ్మడానికి సహేతుకమైన ఆధారాలున్నట్టయితేనూ అరెస్టు చేయవచ్చు. అయితే ఆ ఆధారాలను లిఖితపూర్వకంగా నమోదు చేయాలి. ఇతర కేసులలో అరెస్టు చేయకుండ నోటీసు ఇచ్చి నేర పరిశోధనకు సహకరించమని ఆదేశించవచ్చు. దానిని అనుమానితుడు మన్నించకపోతేనూ అరెస్టుచేయవచ్చు.

**సిఆర్‌పిసిలో 'అన్యాయమైన' సవరణలను వ్యతిరేకించే పాత్ర మీద వేసుకొని ముందుకొస్తున్న న్యాయవాదులకు యుఎపిఎ వంటి 'కఠిన చట్టాలు' ఎందుకు కన్పించడం లేదో? నేర విచారణ స్మృతిలో సవరణ ప్రకారం, ఒక వ్యక్తిని అరెస్టు చేస్తే పోలీసులు కనీసం అందుకు కారణాలు లిఖితపూర్వకంగా నమోదుచేయాలి. ఇంతకు ముందు అది కూడ లేదు.**

ఇందులో తప్పేముంది? వ్యతిరేకించ వలసింది ఏముంది? 7 సంవత్సరాల పరిమితి తొలగించి అన్ని కేసులకూ వర్తింపజేయాలని అడగడం సబబుగా ఉంటుందేమోగానీ వ్యతిరేకించవలసిన అవసరం లేదు. పోలీసులకు విచక్షణ ఇస్తే అవినీతి పెరుగుతుందని లాయర్లు అంటున్నారు. బలవంతుల పట్ల పక్షపాతంతో వ్యవహరిస్తారనీ అంటున్నారు. అది ఎప్పుడూ ఉండేదే. ఈ సవరణ తరువాత కనీసం వారు కారణాలు లిఖితపూర్వకంగా నమోదు చేయాలి. ఇంతకు ముందు అది కూడ లేదు. లాయర్లు అర్థరహితమైన ఆందోళన వదిలిపెట్టి, నిజంగా హక్కులకు భంగకరమైన యుఎపిఎ సవరణకు వ్యతిరేకంగా ఆందోళన చేపడితే సమాజానికి మేలుచేసిన వారవుతారు.